# గురువింద గింజలు

"విన్నావా? హైమవతి ఎంతదృష్టవంతురాలు !" జలజ చేతిలో పేపరు విప్పి చూపిస్తూ విషయ వివరణ చేసింది. "చక్కగా ఎంత పేరు ప్రఖ్యాతులలో చూడు. చదువూ, సంధ్యా లేకుండా, ఏ విషయంలోనూ ప్రత్యేకతా ప్రతిభా లేని హైమ ఇంతటి అదృష్టవంతురాలౌతుందని ఎవరైనా అనుకున్నారా ?"

జలజ మాటలు వింటూ దినపత్రిక తీసి చూచింది సరళ.

హైమవతి ఫోటో ప్రప్రథమ పుటలో ప్రచురింపబడి వుంది. క్రింద చాలా ఘనంగా వ్రాయబడింది. దేశ సంరక్షణ నిధికి పాతిక వేలు తన మిత్రులూ మొదలగు వారి దగ్గర పోగు జేసి యిచ్చిందట. ఇంకా కాందిశీకులకోసం స్వెట్టర్లూ, పాత దుస్తులూ వగైరా సేకరించి పంపడంలో నిద్రాహారాలను కూడా విస్మరించిందట. రెండు మూడు రోజుల కొకసారైనా ప్రముఖ పట్టణాలన్నింటిలో సభలు ఏర్పరచి, ప్రజకు దేశ

భక్తిని ప్రభోదిస్తోందట ! ఇటువంటి స్త్రీలే ఈనాడు దేశానికి ఎంతైనా అవసరమంటూ, సంపాదక మహాశయులు తమ మాటగా వాక్రుచ్చారు.

"అంతా బాగానే వుంది కానీ - మరి ఇల్లూ సంసారం ఎవరు చూస్తున్నారటా, ఇవాళ ఇలా తిరుగుతూంటే ?" పేపరు తిరగా బోర్లావేసి చూస్తూ సందేహం వెలిబుచ్చింది సరళ.

"నీ మొహం." విసుగ్గా, చీకాకుగా అనేసింది జలజ. "ఇలాటి చచ్చుసందేహాలతోటీ, చిన్న చిన్న తాపత్రాయల తోటీ ఏడుస్తాం గనుకనే మన బ్రతుకు లిలా వంటిళ్ళు దాటి వెళ్ళలేకుండా వున్నాయి. మానవజన్మ ఎత్తినందుకు అలా మంచి పేరుతో సఫలత కలగాలి. అందులోనూ దేశసేవ ! అటువంటిదీ, ఇటువంటిదీనా మళ్ళీ?" అడ్డూ అపూ లేకుండా భట్రాజులా పొగిడేస్తోంది జలజ చిన్ననాటి స్నేహితురాల్ని.

సరళ మనసులో చాలా సందేహాలూ, ప్రశ్నలూ చెలరేగాయికానీ, పైకి వెలిబుచ్చితే జలజ తిడుతుందేమోనని పెదవి కదుపలేదు.

"ఇవాళ సాయంత్రం స్టేషన్ దగ్గఱ మైదానంలో పెద్ద బహిరంగసభ జరుగుతోంది. ముఖ్యోపన్యాసకులలో హైమ కూడా వుంది. వస్తావా నువ్వు ?"

"సాయంత్రం నాకెలా కుదుర్తుందీ ? ఆయన ఆఫీసు నుంచి వచ్చేవేళా, పిల్లలు కాలేజీనుంచి వచ్చే సమయం-"

"ఛీ ఛీ." సరళ మాట పూర్తికాకుండానే ఖస్సు మన్నది జలజ "మొగుడూ, పిల్లలూ ఇంకెవళ్ళకీ లేరు; మహా నీకే వున్నాగు. నాకు లేరు, హైమకు లేరు కదూ? ఆ ఇందిరా గాంధిగారుకూడా ఇలాగే అనుకునివుంటే ఈనాడు ఆవిడా, దేశమూ ఇంత ఉచ్ఛస్థితిలో వుండేవారేనా ?"

"బాగుంది. ఆవిడకూ మనకూ పోలికేమిటీ ? మంచి మంచి ఆయాలనూ, వంట మనుషులనూ పెట్టుకోగల ధన వంతులు !"

"ఒక్క మాట విను సరళా ! పెళకాలంటే అనేక కార ణాలుంటాయి. మనస్సులో దేశభక్తి అనేది వుండాలి-వుంటే అందరూ శక్త్యానుసారం ఏదో ఒకటి చేయగలరు దేశంకోసం. అక్కడ సైనికులు ప్రాణాలొడ్డి పోరాడుతున్నది మనందరి కోసం. మనకు కనీసం అక్కడేం జరుగుతోందో - ఏమిటో తెలుసుకొనే తీరికకూడా లేదంటే ఎంత హాస్యాస్పదం !"

"ఛ. మరీ అంత అజ్ఞానురాల్ని కాదులే. పేపర్లలో చూస్తున్నానుగా ?"

"చూచి కథల్లా చదువుకుని మర్చిపోతున్నావన్న మాట ? బాగుంది, భేషుగ్గా వుంది. సరే. నేవెళ్తున్నాను."

సరళకు సిగ్గేసింది. "వస్తాను నేను కూడా. వచ్చే టప్పుడిటురా. కలిసి వెళ్దాం."

జలజను సాగనంపి ఉరుకులు పరుగులతో పనంతా పూర్తిచేసుకుంది సరళ.

మధ్యాహ్నం భోజనాని కొచ్చిన భర్తకు పొంగి పోతూ చెప్పింది తన చిన్ననాటి స్నేహితురాలి నేటి వైభవ

ప్రాభవాలగురించి. "బాగానే వుంది." హాస్యంగా అన్నాడు సత్యన్నారాయణ. "మరైతే ఇన్నాళ్ళూ జ్ఞాపకంలేదా ఈ స్నేహితురాలు నీకు? ఇవ్వాళ ఆవిడ పేరు ప్రఖ్యాతులు చూచి స్నేహం జ్ఞాపకం వచ్చిందా?"

ఇబ్బంది పడింది సరళ సమాధానం చెప్పటానికి. "అదేం లేదు..."

పకపకా నవ్వేశాడు సత్యన్నారాయణ. "సర్లేకానీ, అయితే సాయంత్రం ఆవిడ ఉపన్యాసం వింటావన్నమాట! అయితే కొంచం తొందరగా ఇల్లు జేరుకోవాలన్నమాట — ఈ విధేయుడు?"

నవ్వింది సరళ. "థాంక్స్. కానీ, మీరూ వస్తే ఇంకా బాగుంటుంది."

భోజనం ముగించి లేచాడు సత్యన్నారాయణ. భార్య మాటల కత డప్పుడేం సమాధానం చెప్పలేదు. అన్నట్లు గానే సాయంత్రం రోజుటికంటెఅరగంట ముందుగా వచ్చాడు ఇంటికి.

"ఏం సరళా, తయారవ్వలేదూ ఇంకా? ఎక్కడికో వెళ్తానన్నావ్ మరి?"

"హమ్మయ్య. వచ్చేశారా? ఇదిగో ... యిక చీర కట్టుకోవడమే తరవాయి!"

"కట్టుకునే వున్నావ్ గా?"

"చాల్లెద్దురూ మోటు హాస్యాలూ!" చుతారంగా విసుక్కుంది. "కాస్త మంచి చీర కట్టుకోవాలని నేనన్నది! ఇదిగో... కాఫీ, టిఫినూ. మీరు తీసుకోండి. పిల్లలు వచ్చాక

వాళ్ళకి కాస్త తీసుకోమని చెప్పండి. వంటింట్లో మూత పెట్టాను. దొడ్లో ఆరవేసిన బట్టలు ... వానవస్తేగానీ ..."

"అబ్బబ్బబ్బ! నాకన్నీ తెల్సులే. ఎంతా? ఓ రెండు గంటల్లో వచ్చేయవూ?"

"ఔననుకోండీ..."

"మరీ? తొందరగా వెళ్ళిరా. అదుగో మీ జలజ గారు కూడా వచ్చేశారు."

"ఏమండీ. మీరూ రాకూడదూ?" జలజ చనువుగా అడిగింది సత్యాన్ని. "బహిరంగసభ —" యింకా ఏమేమో చెప్పబోయింది.

సున్నితంగా నవ్వుతూ మధ్యలోనే త్రుంచేశాడు సత్యన్నారాయణ "స్వతంత్రం రాకముందే పుట్టినవాడిని, నేను. దేశభక్తి ఇవాళ క్రొత్తగా ఎవరిదగ్గరా నేర్చుకోవలసిన అవసరంలేదు. సరళ సరదా పడ్తోంది — అందుకని పంపిస్తున్నాను"

"అయితే ఈ జరుగుతూన్న సభలూ, సమావేశాలూ — అన్నీ అనవసరమే అంటారా? నేనూ స్వతంత్రం రాకముందు పుట్టినదాననే!"

"క్షమించండి. నేనలా అనడంలేదు. చాలా అవసరమే కొందరు కొందరికి. కానీ ఆ సభావేదికకోసం, మైకులూ-పోలీసు బందోబస్తువగైరాలకోసం అయ్యేఖర్చును కూడా దేశ సంరక్షణ నిధికిస్తే?"

మాటలకోసం తడుముకుంది జలజ. "మీరు మరీ సిని

కల్‌గా మాట్లాడుతున్నారు. మీవంటి వారికివి అనవసరమే కావచ్చుకానీ, సామాన్య ప్రజలకెలా తెలుస్తుందంటారూ?"

"అది నిజమే లెండి కాని సామాన్యులకు తెలిసి మాత్రం పెద్ద ప్రయోజనమేమిటీ? పోస్టల్ కార్డునుంచి, తినే ప్రతి వస్తువుకూ ధరవరలు పెరిగిపోయాయి. 'డిఫెన్స్ ఫండ్' కోసం ఆఫీసుల్లో, మిల్లుల్లో, కార్ఖానాల్లో, ప్రతిచోటా తప్పని సరిగా చిన్నా పెద్దా అందరు పనివాళ్ళకూ, ఉద్యోగులకూ జీతాల్లో యింతా అని కట్ చేస్తున్నారు."

"అయితే ఏమిటంటారు?"

"తెలియాల్సినది ధనికవర్గంవారికే నంటున్నాను. ఒక్కో స్త్రీ కట్టే చీర, వాడే హ్యాండ్ బాగ్గు, ధరించే నగలు వో నాలుగోవంతు యిచ్చినా చాలు. ఒక్కో మిల్లు యజమాని తీసే లాభంలో వో పదో వంతు యిచ్చినా గొప్పే."

ఉలిక్కిపడ్డట్టు చూసింది జలజ. తాను కట్టుకున్న ఖరీదైన చీరనూ, పెట్టుకొన్న నగలనూ ఓసారి చూచుకొని, సత్యన్నారాయణ ముఖంవెపు చూచింది.

సత్యన్నారాయణ లోలోపల నవ్వుకున్నాడు. "నేను ఏ ఒక్కరి గురించీ అనడం లేదులెండి."

జలజ ఊరుకోలేదు. "బాగుంది ఎంత చెట్టుకు అంత గాలి అనీ..."

"అవునులెండి. అంచేత చిన్న ముక్కలు ఏమైనా ఫర్వాలేదంటారు?"

అంతలో సరళ లోనుంచి వచ్చింది తయారై.

"అయ్యబాబోయ్. మీవారే ప్రధానమంత్రి అయితే, ఏ ఆడదీ నగలు పెట్టుకోకూడదని శాసిస్తారేమో సరళా !"

నవ్వు ఊరుకుంది సరళ. అతిగా మాట్లాడేంత నేర్పరి కాదామె.

"వెళ్తున్నానూ." అంటూ సరళ మళ్ళీ లోపలికెళ్ళి "ఓసారిలా రండి" అని పిలిచింది భర్తను.

"ఏమిటి ?"

"చీర కొనుక్కోవాలని వేరే వుంచాను - ఆ డబ్బు తీసుకెళ్తున్నాను. వచ్చేప్పుడు తెచ్చుకుంటాను."

"ఇవ్వాళ ఏం తొందరా ?"

"జలజకూడా వుంటుందికదా ! తనైతే తన వాడుక షాపులోనికి తీసుకెళ్ళి మంచిది సెలెక్టు చేసిపెడ్తుంది."

"పిచ్చిదానా ? సెలెక్షన్‌లో ఏముందీ ? విత్తంకొద్దీ వైభవం. పిండికొలదీ రొట్టె జలజ కట్టే చీరలూ, హైమవతి ధరించే నగలూ, మరో మందారవతి తిరిగే కార్లూ మనం కన్నెత్తికూడా చూడలేం. వాళ్ళ కాళ్ళ చెప్పులే నీ పెద్దచీర కంటే ఎక్కువ ఖరీదు చేస్తాయి"

సరళ మాట్లాడలేదు.

ఆమె చూపులు చూచి సత్యం కొంచం బాధపడ్డాడు. "సరే. తీసుకెళ్ళి కొని తెచ్చుకో. నే నెందుకు కాదనాలి ? యాభై రూపాయలకుమంచి చీరేమిటీఅని ఆవిడ నవ్వవచ్చు."

"మరి ఆవిడ భర్తకి మీకంటె తక్కువ జీతం కదా- వాళ్ళన్ని వేషా లెలా వేస్తున్నారంటారూ ?"

"జీతం కాదు. అది జీవన విధానంలో తేడా ! సరే - అవన్నీ నీకర్థంకావు కానీ వెళ్ళిరా."

యాభై రూపాయలూ చేతిరుమాలులో చుట్టుకుని వెళ్ళిపోయింది సరళ సంతోషంగా.

## 2

రిక్షా దిగుతూనే ఎవరో వలంటీర్స్‌తో మాట్లాడుతూ వెళ్ళిపోయింది జలజ. పది నిముషాలు గడిచేసరికి జనంలో ఎక్కడ కలిసిపోయిందో పత్తా లేదు.

"ఎంతసేపు నించోను?" అంటూ రిక్షావాడు తొందర చేసేసరికి, ఇక విధిలేక వాడి చేతిలో రెండ్రూపాయలు పెట్టింది. "ఇదేటి ? మరో రెండు రావాల !" అన్నాడు రిక్షావాలా.

"అదేమిటి? మేం ఎప్పుడూ ఇలాగే ఇస్తాం. ఈ ఊరు దాన్నే. కొత్తదాన్నేంకాదు"

"ఆరోజు లెల్లాయమ్మా. అన్నీ మండుకుపోతున్నాయి. అందులోనూ ఇయ్యాల మీటింగు - గిరాకీ ఎట్టగుందో చూశారా మరి ? పడెయ్యండి మరో రెండు." చెయ్యి మీది మీదికి చాపుతూ వాడు వీలైనంత బిగ్గరగా మాట్లాడ్తూంటే ఎన్నడూ ఎక్కువగా బయటకు కదలనిదైన సరళ సిగ్గుపడి పోతూ చచ్చినట్టు మరో రెండు రూపాయలు తీసి వాడి చేతిలో పెట్టింది. బిక్కచచ్చిపోతూ చుట్టూ చూసింది. అంత కంతకు జనం ఎక్కువైపోతున్నారు. జలజ జాడమాత్రం ఎక్కడా కన్పించలేదు సరళకు.

"కూర్చోండి. కూర్చోండి." అంటూ వాలంటీర్సు బలవంతంగా కూర్చోబెడుతున్నారు జనాన్ని.

ఇద్దరు ముగ్గురు వాలంటీర్స్ని జలజకోసం అడిగింది సరళ. ఎవరూ సరిగా చెప్పలేదు.

సభ మొదలైపోయింది. ఉపన్యాసాలు ప్రారంభ మయ్యాయి. జనంలో స్త్రీలవేపు ఒకమూల ఒదిగి కూర్చు న్నది సరళ. ఆమెకు చుట్టూవున్న స్త్రీలను చూస్తే వాళ్ళలో అధిక సంఖ్యాకులకు అసలు జరుగుతున్నదేమిటో, అక్క డెందుకు తాము వచ్చారోకూడా తెలిసినట్లనిపించలేదు. ఉప న్యాసాలు వినడంకోసం పార్టీవాళ్ళు జనాల్ని ప్రోగుజేస్తా రన్నది అబద్ధం కాదని నిర్ణయించుకొంది సరళ.

అంతలో వేదికమీద ఖాళీగా వున్నకుర్చీల్లో హైమ వతి వచ్చి కూర్చుంది. ఆమె అసలే ఆలస్యంగా వచ్చినట్టుంది. ఓగంటసేపు ఏవేవో చెప్పారుఏవేవోసంఘాలనాయకులు. చాలా గంభీరంగా కూర్చుంది హైమవతి. వాలంటీర్సు, ఇంకెవరెవరో వచ్చిఆమెనుఏవేవో మెల్లగాఅడిగివెళ్తున్నారు. కాస్సేపటికి జలజ కన్పించింది సరళ కళ్ళకు. హైమవతి ప్రక్కనే నుంచుని ఏమిటో మెల్లగా చెప్తోంది. అన్నింటికీ గంభీరంగా తల పంకించు తోంది హైమవతి.

'ఆహా. హైమవతి పరపతి ఎంత పెరిగింది! ఎలాటి స్థితిలోంచి ఎంతటి స్థితిలోకి ఎక్కివచ్చింది! అంత ధనవంతు రాలై వుండీ ఎంత సాదా చీర కట్టుకుని ఎంత నిరాడంబరంగా వుందీ!' అనుకొన్న సరళ ఆశ్చర్యపోయింది. 'ఔను. దేశ భక్తురాలు. దేశం – దేశం అంటూ స్వసుఖాలు విడనాడి

రాత్రనక, పగలనక తిరిగేవాళ్ళకి షోకులూ, దర్జాలూ, ఆభరణాలూ ఎందుకు ? అయినా అసలవన్నీ ఎలా వుంటాయి వాళ్ళకి ? పాపం, ఇలా తిరగటానికీ, చేయటానికీ ఎంతెంత ఖర్చయిపోతుందో ! ఒంటిమీద ఒక్క గాజూ, గొలుసూ, కడకు దుద్దులు జతైనా లేదు !' ఈ ఆలోచన కలిగేసరికి తన పట్టుచీరను చూచుకొని తనకే సిగ్గైంది సరళకు.

హైమవతి ఉపన్యాసం ప్రారంభమైంది. అనర్గళంగా, గంభీరంగా సాగిపోతోంది హైమ వాక్ప్రవాహం. "ఇక్కడ మనం ఇలా హాయిగా తిని తిరుగుతూ ఉన్నాం. కాని అక్కడ మనసాటి సోదరీమణులు నానా అవమానాల పాలై చిత్రహింసలకు గురిఔతున్నారు. పెద్దా చిన్నా తారతమ్యం లేకుండా, ఆడా మగా తేడాలేకుండా, పసివాళ్ళూ బలహీనులూ అనే కనికరం చూపకుండా దౌర్జన్యాలు సాగిస్తూ మారణహోమం చేస్తున్నారు ఈ అత్యాచారాన్ని అరికట్టాలని మన జవానులు కంకణం కట్టుకొని పోరాడుతున్నారు. చనిపోయిన-అంగవికలులైన జవానుల కుటుంబాలకు ఇతోధికంగా సాయంచేయాలి; మన శరణువేడి వచ్చిన శరణార్థులకు పోషణ జరగాలి — మన భారతదేశం అన్నపూర్ణ ! అతిథి అభ్యాగతుల ఆదరణకు మన పూర్వులు పెట్టినది పేరు. శరణాగతుల రక్షణే అనాదిగా మన భారతీయుల ధ్యేయం..."

'ఎందరు చెప్పినా ఇవే సంగతులు. ఇదే ధోరణి. ఇందులో క్రొత్త ఏముందని జనం మళ్ళీ మళ్ళీ ఇలా పోగు

పడి వింటారు? భర్త మాటలు సబబుగానే వున్నాయి—ఈ సభ ఏర్పాటు కయ్యే ఖర్చులు రక్షణనిధి కివ్వకూడదూ?' అన్పించింది సరళకు.

హైమవతి వాక్ప్రవాహం సాగిపోతూనేవుంది. "జనులారా? ఈ కష్టం మన అందరిదీ. మన జీవితాలు ఇలా సుఖంగా సాగాలంటే మన దేశ రక్షణను మనం గట్టి బఱచుకోవాలి. మనకోసమే అక్కడ జవానులు ప్రాణాలర్పిస్తున్నారు. మనపై విశ్వాసముంచి మన శరణువేడి వచ్చిన బాంగ్లాదేశస్థులను కాపాడి మన తల్లి భారతి పేరు ప్రతిష్ఠలను నిలపడమే కాదు — ఇనుమడింపజేస్తున్నారు — అందుకే మన దేశం పేరు ప్రతిష్టలంటే ఏమిటి — మన ప్రతి ఒక్కొక్కరి పేరు ప్రతిష్ఠలూ నన్నమాట! ప్రజాప్రభుత్వం అంటే ఏమిటి? మన అందరిదీ. మనలో ప్రతి ఒక్కరిదీ. అందుకే దేశఔన్నత్యం నిలబడాలంటే స్త్రీలందరూ వీరమాతలు వీరపత్నులూ కావాలి. మీమీ బిడ్డలనూ, సోదరులనూ, భర్తలనూ ప్రోత్సహించి సైనకదళాలలో జేర్చండి మీకు తోచినంత - అల్పమని ఆలోచించవద్దు — చంద్రునికో నూలుపోగన్నట్లుగా - ఎంతైనాసరే - శక్త్యానుసారం- విరాళాలివ్వండి. మీరిచ్చిన ప్రతి రూపాయీ - ఎందరో పాపాయిలకు వినియోగిస్తుంది

"సోదరీమణులారా. ఇది ముఖ్యంగా స్త్రీలవల్ల అయ్యే పని. తెల్లవారి లేస్తే ఎన్నో ఖర్చులు చేస్తాం. ఆలోచించండి. అన్నీ అవసరమైనవే కాదు. మనం తల్చుకొంటే ఎన్నో ఖర్చులు తగ్గించుకోవచ్చు. ఉదాహరణకు సినిమాలు మానుకొని ఆ డబ్బు విరాళంగా ఇవ్వండి. మన సైనికుల కష్టం

అంటే మన కష్టమే. ఎందరో తల్లులు, భార్యలు, బిడ్డలు అక్కడ యుద్ధంలో పోరాడుతున్న — మరణిస్తూన్న తమ వారికోసం దురపిల్లుతున్నారు. ఇదంతా ఎందుకు? మన అందరి కోసమేకదా ! ఇటువంటి స్థితిలో మనం పండగలు జరుపుకో కూడదు. పండగకు క్రొత్త బట్టలు—పిండివంటలు అంటూ ఎంతెంత డబ్బో ఖర్చుపెడ్తుంటాం మనం. ఈసారి ఆ ఖర్చును మాని ఆ పైకాన్ని అమ్మల్లారా— అయ్యల్లారా — విరా ళంగా ఇవ్వండి. మీరిచ్చిన చిన్న మొత్తమే - ఒక యింట పెద్ద జ్యోతిస వెలిగించవచ్చు - మరో యింట ఎన్నో ప్రాణా లనూ ఆశలను నిలిపినది కావచ్చు..."

వాలంటీర్సు డబ్బాలు పట్టుకుతిరుగుతున్నారు గలగల లాడిస్తూ. జనమంతా పోటాపోటీలుగా వేస్తున్నారు అందులో- పావులాలు, అర్ధలు, చిన్న నోట్లు, పెద్ద నోట్లు ! ఒంటిమీద సరిగా బట్టలులేని కార్మికుడు — ఒక రూపాయినోటు వేశాడు. అందర్నీ పరీక్షగా చూస్తోంది సరళ. తల దువ్వుకో కుండా మాసిన గుడ్డలతోవున్న స్త్రీ-చంకన పాలకోసం ఏడు స్తూన్న పిల్ల - ఆమెకూడా పైటచెంగు మూటవిప్పి ఆలో చించి ఆలోచించి ఓ అర్ధరూపాయ వేసింది. ఇక సరళవంటి వాళ్ళు అయిదులూ, పదులూ - ఓహ్ ! లెఖ్ఖేలేదు. ఆవేశం ఆవరించింది సరళను. 'ఈ సభ అనవసరం అదీ — ఇదీ అను కొన్నాను.నా బుద్ధి - నా ఆలోచనలు చాలా చిన్నవి. ఈ డబ్బంతా ఎట్లా వసూలౌతుంది మరి ! హైమవతీ, జలజ, వాలంటీర్సు ...అందరూ ఎంతగా తమ పనులను మానుకొని

శ్రమపడుతున్నారు ! నిజంగా యిటువంటి సభలూ, ఉపన్యాసాలూ ఎంతైనా అవసరం !

సరళ మనస్సు సిగ్గుతో కుంచించుకుపోయింది. 'నా వంటివాళ్ళు ఏ ఉపన్యాసమూ యివ్వలేరు. వంటింటికి తప్ప ఎందుకూ పనికిరారు !' తన కొంచెపుతనాన్ని ఎంతైనా నిందించుకున్నది. పెళ్ళినాటి పట్టుచీరలు రెండు, సినిమాకైనా పేరంటానికైనా కట్టుకోవటానికి ఓ సిల్కుచీర, రోజూ కట్టుకోవటానికి యింట్లో రెండు మూడు వాయిల్ చీరలూ వుండనే వున్నాయి. పట్టుచీరలు చాలా పాతవై చిరిగిపోవటానికి సిద్ధంగా వున్నాయి. అందుకే సిల్కుచీరకుతోడు ఇంకో మంచి చీర కొనుక్కుందామనుకుంది యాభై రూపాయలతో. కాని హైమవతి ఉపన్యాసం విన్నాక, 'మరోసారి కొనుక్కోవచ్చులే నా చేత్తో నేనుకూడా దేశానికి ఏమైనా యివ్వాలి' అనే భావోద్వేగం పొంగిపొర్లగా జేబురుమాలు మడతవిప్పి ఓ పదినోటు తీసి అక్కడే తిరుగుతూన్న ఒక వాలంటీరు చేతిలోని డబ్బాలో వేసింది. నోటును ప్రయత్నంగా లోపలికి కుక్కవలసివచ్చింది. అంతగా నిండిపోయింది ఆ హుండీ. ఆమాత్రం చేయగలిగినందుకు ఎంతగానో గర్వపడింది సరళ మనస్సు.

అప్పటికి ఆమెకు తిరిగి తన స్థితి గుర్తుకువచ్చింది. ఒక్కతే యింటికి తిరిగి వెళ్ళగలదా? అసలు ఈ జనప్రవాహం నుండి బయటపడటం ఎలాగు ? కొద్దిగా భయంకూడా వేసింది.

"చూడండీ ! జలజగార్ని కల్సుకోవాలి నేను !" ఒకరిద్దరు వాలంటీర్సు సరళ అభ్యర్థనను వినికూడా ఖాళీ లేనట్లు సమాధానమే ఈయకుండా వెళ్ళిపోయారు.

వేదికవద్ద చాలా కోలాహలంగా వుంది. ఫోటోగ్రాఫర్సు ఫోటోలు తీస్తున్నారు. సభాధ్యక్షత వహించిన మంత్రిగారికి తాను యిదివరలో పోగుజేసిన విరాళాలన్నిటినీ చెక్కు రూపంగా అందిస్తూన్నది హైమవతి. చెక్కును ఒక చివర మంత్రీ, మరో చివర హైమవతీ పట్టుకొని వుండగా కెమెరాలు క్లిక్కుమన్నాయి.

సభ ముగియవచ్చింది. జనం ఎవరితోవ్రవన వారు పోవటానికి సన్నాహమౌతూన్న కారణంగా త్రోక్కిసలాట ప్రారంభమైంది. సరళ పై ప్రాణాలు పైననే పోయాయి. జనం అందర్నీ వెఱ్ఱిదానిలా చూస్తూ తానూ తప్పనిసరిగా వాళ్ళతో బాటు కదలసాగింది. జనంలోపడి పావుగంట యుద్ధం తర్వాత ఆ పందిరినుండి బయటపడింది. ఆ జనంలో స్వేచ్ఛగా కదిలి ఏదైనా వాహనం మాట్లాడుకొనే చొరవకూడాలేని సరళ ఏమీ పాలుపోక చూస్తూంటే ఆపద్బాంధవుల్లాగా పరిచితులు కన్పించి పలుకరించారు, "ఏమండీ, మీరొక్కరే వచ్చారా? సత్యంగారు రాలేదూ ?" అంటూ.

ప్రాణం లేచివచ్చినట్లైంది సరళకు. ఆ యిరువురూ సత్యనారాయణ పనిచేసే ఆఫీసులోనే పనిచేస్తున్నారు.

"ఓ స్నేహితురాలితో వచ్చాను. ఆయన ఇంటిదగ్గరే వున్నారు ఈ జనంలో ఆవిడను కల్సుకోలేను మళ్ళీ." అంటూ తనకు కలిగిన ఇబ్బందిని అస్పష్టంగా విశదీకరించింది.

“ఫర్వాలేదులెండి.” అంటూ వాళ్లే ఓ రిక్షాని కేకేసి బేరమాడి, ఇల్లు ఆనవాళ్ళు చెప్పి “జాగ్రత్తగా తీసుకె”ళ్ళమని మరోసారి హెచ్చరించారు, రిక్షావాలాను.

సరళ రిక్షా ఎక్కలేదు. చీకటి రాత్రి! ఆమెకు అంత దూరం ఒక్కతీ వెళ్ళటానికి ధైర్యం చాలటంలేదు. ఆమాట పైకి చెప్పటానికసలే అభిమానం అడ్డువస్తోంది!

సరళ వాలకాన్ని గ్రహించి ఆమె సందేహాన్ని అర్థం చేసుకోగలిగారు వాళ్ళు. “సరేలెండి. యింటివఱకూ వస్తాం మేంకూడ. సత్యన్నారాయణగారితో మాట్లాడే పనికూడా వుంది కొంచం.” అంటూ వాళ్ళూ తమ సైకిలుమీద రిక్షాను అనుసరించేసరికి కోల్పోయిన ప్రాణాలు తిరిగి పొందినట్లైంది సరళకు.

## 2

“అయితే మీ జలజకూడా పెద్ద దేశభక్తురాలైపోయిందన్నమాట! రేపో ఎల్లుండో ఈవిడగారి సేవనిగురించి కూడా పత్రికలు కీర్తించుతాయన్నమాట!” వంట చేస్తూన్న సరళ దగ్గఱకువచ్చి తీరిగ్గా పీటమీద కూర్చుని బాతాఖానీ ప్రారంభించాడు సత్యన్నారాయణ.

సరళ మాట్లాడలేదు.

“ఎక్కడికెళ్ళావమ్మా?” కూతురు లలిత ప్రశ్న.

“అమ్మక్కూడా దేశభక్తి ఎక్కువైపోయిందా ఏమిటి?”

"ఎప్పుడూ లేనిది - నాన్నని యింట్లో పెట్టి నువ్వు మీటింగు కెళ్లావంటే ముందు నమ్మబుద్ధి కాలేదమ్మా. రియల్లీ దిసీజ్ ఎయిత్ వండ రింది వరల్డ్ !"

సూర్యం, చంద్రం వరుసగా రిమార్కులు చేశారు.

పిల్లల ముఖాలు పరిశీలనగా చూచింది సరళ. ఆమె వదనంలో ఏ భావమూ ప్రస్ఫుటం కానప్పటికీ పిల్లలు బెదిరి నట్లుగా ముఖాలు పెట్టి మౌనం వహించారు.

నెమ్మదిగా అంది సరళ. "రాత్రనక పగలనక ఎప్పుడూ ఏ వేళల్లో కావలసినవి ఆ వేళల్లో అమర్చిపెడతాను. మిమ్మ ల్నందర్నీ హాయిగా తిరగమంటాను, నే నిల్లు కనిపెట్టివుండి. ఈ ఒక్కరోజు — అమ్మ బయటికి వెళ్లానని — భోజనం ఓ గంట ఆలస్యమైందనీ తపించిపోతున్నారు పసిపిల్లల్లాగా. ఇదేమైనా బాగుందా సూర్యం ? వాళ్ళంటే మగవాళ్ళు — నువ్వూ అదే తీరా లలితా, ఆడపిల్లవు ! కాలేజీ చదువులు చదువుతున్నారు మళ్ళీ !"

సరళ మాటలు ఎంతో మందస్వరాన వెలువడ్డా, ఏమిటో సూటిగా వాడిగా గ్రుచ్చుకున్నట్లైంది శ్రోతలకు. నివ్వెరపోతూ మౌనంగా ముఖముఖాలు చూచుకున్నారు.

సత్యన్నారాయణ బాధపడ్డాడు పిల్లల ముఖాలు అనవ సరంగా చిన్నబోవడం చూచి "వెళ్ళి చదువుకోండమ్మా. వంటయ్యాక అమ్మ పిలుస్తుంది." అని పంపేశాడు.

"డియర్ ! ఆ కూరల పళ్ళెం ఏదీ — నువ్వు మిగతా పనులు చూచుకో. నేలోగా కోసిచ్చేస్తాను " అంటూ సరళ వారిస్తూన్నా వినకుండా కూరలు తరగడం ప్రారంభించాడు.

"ఛ. అయితే, ఓ గంట ఆలస్యమౌతుంది కానీ — మీరెందుకూ?" అన్నది నొచ్చుకుంటూ. "ఇంత ఆలస్యమౌతుందనుకుంటే వెళ్ళకేపోదును !" అన్నది తిరిగి స్వగతంగా.

"ఇప్పుడేమైంది గనుకా ? అసలింత ఆలస్యమౌతుందని తెలిస్తే నేనూ పిల్లలూ వండేసేవాళ్ళం కదా ! ఏదో యింత ఉప్పూ కారం వేసేసి ఉడకబెట్టేసేద్దుం — అనక గొంతు దిగేదీ లేనిదీ వేరే విషయం !"

ఇద్దరూ ఒకేసారి ఫక్కాలున నవ్వుకున్నారు ఆ మాటలకి.

వాతావరణంలోని బరువు కాస్త తగ్గినట్లైంది.

"అయితే చీర కొనడానికి టైము దొరకలేదన్న మాట !" ఇప్పటికి ఆ ప్రస్తావన ఎత్తటానికి ధైర్యం చిక్కింది సత్యానికి.

నట్టుతూ నట్టుతూ అసలు విషయం చెప్పేసింది సరళ. సభలో అందర్నీ చూచినందువల్ల, ఉపన్యాసాలు విన్నందువల్లా కలిగిన ఉద్రేకమూ, ఆవేశమూ ప్రస్తుతంలేవు. అనేక అనుమానాలు మొలకెత్తుతున్నాయి ఆమె మనసులో. సరిగ్గా అదే విషయాన్ని భర్తపైకే అనేశాడు: "దేశభక్తి అత్యావసరమే ! ప్రతివాళ్ళూ తప్పక సాహాయ్యం-శక్తికొలదీ చేయాల్సిందే. కానీ ... ..."

"ఏమిటి మరి ? ఏమిటి మీ సందేహం ?"

"మనం, మన శక్తికొలదీ ఇవ్వదలచుకున్నది నిజంగా అసలైనవారికి చేర్చేవారికి ఇవ్వాలి. యిటువంటి చోట్ల గుట కాయస్వాహాలు చేసే వాళ్ళెంతమందో మనకేం తెల్సు ?

ఈ డబ్బాలలో పోగవ్యేదంతా అస్సలు వారికి చేరుతుందం టావా ?"

"బాగుంది" మనస్సులో సరిగ్గా తానూ అదేవిధంగా అభిప్రాయపడ్తున్నా పైకి మాత్రం ఒప్పుకో లేకపోయింది సరళ.

"ఛ. మరీ అంత పబ్లిక్ దొంగతనాలుంటాయా ?"

మరి ఆ విషయం తర్కించలేదు సత్యన్నారాయణ. "ఆఫీసులో జీతంలో కట్ చేసిందైతే, మరే సంఘం వాళ్ళకో యిచ్చినదైతేనేం నలభై రూపాయల వరకూ ఉంది. పిల్లలు డిఫెన్స్‌ఫండ్ అంటూ కాలేజీకి తీసుకెళ్ళి యిచ్చింది – తలా అయిదూ ! అంటే ముగ్గురూకలసి మూడు అయిదులు పది హేను రూపాయలు ! సరే – యివ్వాళ నీ దేశభక్తికిమ్మత్తు పదహారు రూపాయలు !"

"రిక్షా డబ్బులుకూడా లెఖ్ఖ వేస్తున్నారా ?" సరళ అడిగింది.

"ఔను. అవి మాత్రం ఎందుకు ఖర్చయినట్టు మరీ ? మీ దేశభక్తురాల్ని ఆ సభకు నువ్వు తీసుకెళ్ళావు. నువ్వు తిరిగి అక్కడి నుంచి యిల్లు జేరావ్. రిక్షావాడు నీకేం ఊరికే రిక్షా కట్టాడా ?"

సరళ మౌనంలోనే అంగీకారం యిమిడివుంది.

"సరే. ఏక మొత్తంగా ఓ డెభ్భ అయిదు లెఖ్ఖ కొస్తు న్నాయి. ఇదికాక పోస్టల్ కవరునుంచీ ఎక్కువ ఖరీదులే కదా ! ఈ విధంగా మనం ఖర్చులకు తట్టుకుంటూ బ్రతుకును వెళ్ళదీయాలీ అంటే కొన్ని ఖర్చులు తగ్గించుకోవాలి."

"సరళ ఆశ్చర్యంగా చూచింది. "ఏం, అనవసర ఖర్చులూ, షోకు ఖర్చులూ పెడుతున్నాంగనుకా అసలు మనం? ఏం తగ్గించుకోగలమూ!"

"ఒక్కసారిగా అలా భయపడి నన్ను ఖంగారు పెట్టే యకు. ఏరీ ... పిల్లల్ని కూడా పిలువు. అందరం కలసి ఆలోచిద్దాం ఏం తగ్గించుకోగలమో !"

పిల్లలు ముగ్గురూ తమలో తాము తర్జన భర్జనలు సలిపి, చెప్పారు ముక్తకంఠంతో. "మా పాకెట్ మనీ తగ్గించుకుంటాం. ఈ రెండు నెలలూ ఇవ్వకండి. సినిమాలు చూడం"

"గుడ్ !" హర్షం వెలిబుచ్చాడు సత్యన్నారాయణ. "ఇల్లాలా ! మరి నువ్వేం తగ్గించగలవో చెప్పు ?"

సరళ నవ్వింది.

"నవ్వటం కాదు. నేను చెప్తాను విను. మా స్నేహితురాలు ఉపన్యాసంలో చెప్పినట్లుగా - పండగలు మానేద్దాం. అనగా పిండివంటల ఖర్చూ, క్రొత్తబట్టల బెడదా తగ్గిపోయిందన్నమాట! మరో విధంగా చెప్పాలంటే, పండగలకీ, క్రొత్త బట్టలకీ, కొన్నాళ్ళవఱకూ డబ్బులు లేవు. అప్పులు తెచ్చే కంటే ఉన్నదాంట్లో సరిపెట్టుకోవాలన్నమాట !"

"బాగానేవుంది." సరళ విరసంగా అలా అనటంలోనే ఆమె అయిష్టమంతా ప్రతిబింబిస్తోంది.

"బాగుందోయ్ !" పరిస్థితిని హాస్యంలోనికి దించేశాడు సత్యన్నారాయణ. "మీ మహిళల బాధ్యత ఎంతైనా ఉంది నేటి సమాజంలో. మరి ఇంతవఱకూ ఏమిటి విని

వచ్చావ్ ? ఇంతలోనే మఱచి పోయావా ! ఓ పని చెయ్యి—గొప్ప గొప్ప మహిళలందరి ఫోటోలూ తెచ్చి వంటింట్లో గోడలనిండా కొట్టేయి. వాళ్లందర్నీ చూసైనా అప్పుడప్పుడూ కర్తవ్యం గుర్తు చేసుకొంటుంటాందువుగాని !"

"భేష్ ! అయితే ముందు హైమవతిగారి ఫోటో పెట్టుకుందామా ?" సూర్యం ధర్మసందేహం వెలిబుచ్చాడు.

వెంటనే అందరితో బాటూ సరళా నవ్వేసింది. "చాల్లెండిగానీ భోజనాలు చెయ్యండి."

ఆ ప్రస్తావన అంతతో ముగిసిపోయింది.

పిల్లలూ, భార్య ఖర్చులు తగ్గించుకున్నందుకు సత్యన్నారాయణా, స్వతంత్రించి తానంత ఖర్చుచేసిన దానికి భర్త ఏమీ అననందుకు సరళా ఎవరికి వారే లోలోన సంతోషించారు.

"బొటాబొటీ జీవితాలు గడిపేవాళ్లం - మనమేం చేయగలమనుకోకుండా యథాశక్తిని మనమూ ఏదో ఉడుతాభక్తిగా సాయం చేయగలిగాం. అదే తృప్తి!" భార్యాభర్తలిద్దరూ సంతృప్తిగా నిట్టూర్చారు.

## 3

వంటింటి పనంతా ముగించుకొని, బట్టలుతకడానికి కూర్చున్న సరళ వీధి తలుపు లెవరో బ్రద్దలు కొడుతూన్నం

తగా బాదేస్తూండడం వినవచ్చి ఆ సబ్బు చేతులతోనే ఆదరా బాదరా పరుగెత్తింది, సగం ఉతికిన చీరని అలాగే వదిలేసి.

"అబ్బ! ఏం చేస్తున్నావ్ తల్లీ, తలుపులు బాదీ బాదీ చేతులు పడిపోయాయ్. అల వైకుంఠపురంబులో — అన్నట్లుగా ఎక్కడో వుంటావ్ కాని, ఎప్పుడూ కాస్త తీరికగా ముందు గదిలో కూర్చుని వుండవుకదా !" జడివానలా దబదబా మాట్లాడేస్తూ లోనికి అడుగెట్టి ఉస్సురంటూ ఓ సోఫాలో కూలబడింది జలజ.

నిజానికి అంత పని సమయంలో ఆమె రాక అంతగా ఆనందకారణ మన్పించలేదు సరళకు. అయినా ముఖంమీద నవ్వు పులుముకుంది. "ఏమిటి విశేషం ? మంచినీళ్ళు కావాలా ?" అనడిగింది ప్రక్కన కూర్చుంటూ.

"చల్లటిదేదైనాసరే తల్లీ, ఇయ్యి - తీసుకుంటాను" నిరుత్సాహమాటంగా అనేసింది జలజ.

కూజాలో మంచినీళ్ళు గ్లాసులోకి తీసి నిమ్మరసం పిండి చిటికెలో అందించింది సరళ.

ఒక్క గుక్క త్రాగి ప్రక్కన పెట్టేసింది జలజ.

అర్థంకాని సరళ, "ఏం పంచదార తక్కువైందా ?" అనడిగింది.

"అదేంకాదు. నాకు బాగా చల్లగా వుంటేకాని ఈ వేసవిలో త్రాగబుద్ధికాదు. అయినా, నాకు తెలియకడుగుతానూ — ఇలా ఎన్నాళ్ళు నెట్టుకొస్తావ్ సరళా? పెద్దది

కాకుంటే — కనీసం ఓ చిన్న ఫ్రిజ్ అయినా కొనుక్కో కూడదూ ?"

మనస్సు చివుక్కుమన్నది సరళకు, జలజ ధోరణికి. ఆశ్చర్యంకూడా కలిగింది. అదే మాటను పైకే అనేసింది: "మీరు అంతగా ఎలా అన్నీ కొనుక్కుంటారో నాకర్థంకాదు జలజా ! కనీసపు తిండీ, బట్టా ఖర్చులు నెట్టుకొచ్చేసరికి నెల జీతంతో ప్రాణంపోతుంది—సరిపెట్టలేక సరిపెట్టలేక హైరాన పడిపోతాను !"

అదేదో అతి సాధారణమైన మాటకు నవ్వినట్టుగా తేలికగా నవ్వేసింది జలజ; సమాధానం మాత్రం చెప్పలేదు, సూటిగా.

"ఓ పనిమీద వచ్చాను సరళా!" అంటూ ప్రసంగం మార్చేసింది.

"ఏమిటీ ?" సరళ పైకి మాట్లాడ్తోన్నదే కాని, జలజ ధోరణి ఎంతో విపరీతంగానూ మనసును బాధించేదిగానూ ఉన్నది ఆమెకు. తన అంతస్థూ, ఫ్రిజిడైరి వగైరాలు తనకున్నాయని చెప్పి బుద్ధిపూర్వకంగా కించపరచుతూన్నందుకూ కాదు 'మొన్న అలా కలసి వెళ్ళి తీరా అక్కడదిగాక ఆ సభ హడావుడిలో పడిపోయాను. నువ్వు ఒక్కతెవూ 'ఫీ' లైవుంటావ్.' అని క్షమాపణ చెప్పుకొంటుందేమోనని భావించింది సరళ. కాని అటువంటి కనీసపు మర్యాదలుకూడా అనవసరమన్నట్లుగా వున్నది జలజ తీరు. పొరపాటునకూడా ఆమె ఆ విషయం ఎత్తలేదు. ఇక అటువంటివి తనకు తానై

మాట్లాడి తేలికపడే నైజంకాదు సరళది. అందుకే ఆమెకూడా అసలా సంగతి ప్రస్తావించనే లేదు.

"పాపం, దిక్కుమాలిగా పడివున్న కాందిశీకుల కోసం బట్టలన్నీ పోగుజేస్తున్నాం సరళా. పనిమనుష్యులకూ, పిల్లల పక్కలకూ ఎన్నిపాత చీరలు పడవేస్తూ వుంటాం మనం. అవి మనకు లెఖ్ఖలోనివేకాదు, నిజంగా. కాని అక్కడ కట్టుగుడ్డలతో వచ్చి పడివున్న శరణార్థిస్త్రీలకు ఆ పాతచీరే పట్టుచీరతో సమానం. ఎంతో పెద్దసాయాలు చేయలేకపోయినా ఈ మాత్రమైనా మన సాటి స్త్రీలకు మనం చేయడం మానవత్వం అన్పించుకుంటుంది." చిన్న ఉపన్యాసం దంచింది.

"ఊలు దుస్తులు, దుప్పట్లు, చిన్నజాకెట్లు, తువ్వాళ్ళు ఒకటేమిటి -- మనం ఏమి ఈయగలిగితే అదే! ప్రత్యేకంగా యిదీ అనిలేదు." జలజ వెంటనే వచ్చిన – ఆమెవంటిదే అయిన మరోస్త్రీ వివరించింది, తానూ ఉన్నానని!

"ఊఁ. కానీయ్ సరళా! నువ్వుకూడా ఏమైనావుంటే ఇయ్యి. వెధవపాతబట్టలు లెఖ్ఖేమిటి చెప్పు?" జలజ అన్నది.

'పాతబట్టలంటూ పడివుండేందుకేముంటాయి? ఎప్పుడూ ఒంటిమీద ఒకచీరా, దణ్ణెంమీద ఓ ఉతికిన చీరేగా వుంటుంది తనస్థితి!' ఆలోచనలో పడింది సరళ. 'చీరబాగా పాతబడి చిరుగుపట్టి పోతేనేకాని వదలలేనటువంటి స్థితితమది! ఆ పాతబడినది విధిగా నాలుగు నెలలకోసారి పనిమనిషి కిచ్చేయాల్సిందే! ఇక దానధర్మాలకంటూ మిగిలేదెక్కడా? కాని ఇందరిలో తమ స్థితి చెప్పుకొంటే నగుబాట్లుకాదూ!'

"ఏమిటి సరళా అంతాలోచనా? మనంపడేసే పనికి మాలిన పాతచీర అక్కడ ఓ స్త్రీ పాలిట పట్టుచీర! సాటి వాళ్లకి ఈమాత్రం చేయకపోతే ఇంకెందుకు చెప్పు మన బ్రతుకులు! మనమేం లక్షలూ వేలూ ఈయడం లేదు కదా!" జలజ ఉపన్యాసం మొదలుపెట్టింది.

సరళకు ఇక ఆ ఉపన్యాసాలు వినే శక్తి లేదు, తన అశక్తినీ, లేమినీ చాటుకొనే ధైర్యమూ లేదు. అలా వచ్చిన వాళ్ళు - అందులోనూ పరిచయస్థులు ఏమీ వసూలు చేయనిదే కదలరు కదా!

"ఇవిగోనండీ, ఈ వీధిలో వసూలైనవన్నీ!" జలజ అనుయాయులు ఇంచుమించు ఓ బస్తాడు బట్టలు మోసుకొచ్చినట్టుగా మోసుకొచ్చారు. అక్కడికక్కడే అవి గ్రుమ్మరించి, పరిశీలించటంలో నిమగ్నురాలైంది జలజ.

చూస్తూన్న సరళ కనులు చెదిరినట్లైంది. గబగబా మేడమీదికి పరుగెత్తింది. తమకున్న ఒకే ఒక్క అల్మైరా తెరచింది. ఇందులో ఏదివ్వాలి? అన్నీ అంతో యింతో ఉపయోగంగా వున్నవే! అన్నిటికంటె పురాతనమైనది తమ పెళ్ళినాటి పట్టుచీర! పెళ్ళై ఇరవై ఏళ్ళు కావస్తోంది. ఎప్పుడైనా ఏ పెళ్ళి భోజనాలకో ముచ్చటగా, పొందికగా కట్టుకోవడం, విప్పేయడంతప్ప - ఎప్పుడెక్కడ పిగిలి పోతుందోననే భయం వుండనే వుంటోందీమధ్య. అదిచ్చేస్తే?......
కానీ.... కానీ.... అది - పెళ్ళినాటిది! ఎన్నెన్ని తీపి గుర్తులున్నాయి దాని మాటున? మరెన్ని మధురమైన జ్ఞాపకాలు! దానికీ తమ భార్యాభర్తలకూ ఏదో చెప్పరాని

మధురానుబంధం. తానా చీర ఎప్పుడు ధరించినా ఎంతో గుంభనంగా భావగర్భితంగా నవ్వుతాడు సత్యనారాయణ, తన దెస కొంటెగా చూస్తూ ! ......

"సరళా ! మరి వెళ్ళమా మేమూ ?" క్రిందినుంచి కంచుగంటల్లాంటి కంఠాల పిలుపులు.

"వస్తున్నా!" ఇక ఆలోచించకుండా గబగబా ఆ చీర తీసుకెళ్ళి ఇచ్చేసింది. తనకైతే అది ఉన్న అన్నింటిలోకీ గొప్పదీ - ఇవ్వతగినదీ అన్పించింది కాని—వాళ్ళకు మాత్రం ఎక్కడా ఆనినట్లు లేదు. 'ఇదొక్కటేనా ఇంతా నిలబెట్టి ?' అన్నట్లున్నాయి ఒక్కొక్కళ్ళ చూపులూ. చీర భద్రం చేసుకున్నారు.

"మరి వెళ్తాం" అంటూ నిష్క్రమించిన వాళ్ల కంఠాల్లో, నడకల్లో ఏదో నిరసన వినవచ్చినట్లై, 'ఇదీ' అని చెప్పరాని బాధావమానాలకులోనైంది సరళ. 'గొప్పవాళ్ళు. యేమైనా ఇయ్యగలరు – యేమైనా చేయగలరు. రోజులు గడపటానికే తాపత్రయపడే మా వంటి వారింతకంటె ఏం చేయగలరు ? ఏమీయగలరు ?' అనుకొంది.

## 4

"అమ్మా. మనం ఒక్కసారి హైమవతిగారింటికి వెళ్ళాలమ్మా !" కాలేజీనుంచి వస్తూనే తల్లితో బ్రతిమాల్తూన్న ధోరణిలో అడిగింది లలిత.

"ఎందుకూ ?" సరళ ప్రశ్న.

"కాలేజీలో లేడీస్ అసోసియేషన్ వాళ్లం ఓ సభకు అధ్యక్షురాలిగా ఆవిడని ఆహ్వానించదలచుకున్నాం."

"అయితే, నే నెందుకూ మధ్యనా ?"

"అబ్బ. నువ్వు ఆవిడని బాగా ఎరుగుదువనీ, ఫ్రండ్ వనీ అవనీ ఇవనీ చెప్పడంలో అందరూ కలసి ఆ బాధ్యతను నా మీదికి త్రోశారు."

"బాగుంది. అయినా నా ఫ్రండేమిటే! ఏ నాటి మాటో అది ! ఈనాడు ఆవిడసలు నన్ను గుర్తు పడ్తుందో లేదో !" సరళ అమాయకంగా తన అనుమానాన్ని బయట పెట్టేసింది.

అనుకున్నట్లే అయ్యింది. హైమవతి ఇంటినీ, తోటనీ, కాపలా వాడినీ అన్ని వైభవాలనూ గేటు బయటినుంచే ఆశ్చర్యంగా చూస్తూన్న సరళనూ, లలితనూ అప్పుడే కార్లో బయటినుంచి వస్తూన్న హైమవతి గుర్తించలేదు. కాపలా వాడు 'ఇప్పుడు దర్శనం కాదు, మీతో మాట్లాడరు. పొమ్మం టూంటే ఎవరో నని యథాలాపంగా అటు చూచింది హైమవతి !

హైమవతీ, సరళా ఒకరి ముఖా లొకరు చూచుకున్నారు. కళ్ళూ కళ్ళూ కల్సుకున్నాయి. హైమవతి సరళను గుర్తించి నడవడానికి ఆమె కనుల కదలికలే సాక్ష్యం. కాని ఎవరో అపరిచితులే నన్నట్లుగా ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

సరళ ఆశ్చర్యపోయింది. లలిత ముఖం మాడింది.

కన్నకూతురి ఎదుటే అవమానంతో తలెత్తలేక పోయింది సరళ. ఎలాగో చూడలేక అటు చూచి, "వెళ్ళి పోదాం లలితా, నాకు లోపలికి వెళ్ళాలని లేదు" అన్నది.

లలిత ప్రసన్నంగా పెట్టింది ముఖం. "అవసరం మనది కదమ్మా! ఇంత దూరమూ వచ్చి.........."

ఇక తప్పలేదు సరళకు.

అరగంటసేపు వేచి వున్న తర్వాత హైమవతి దర్శనం అయింది. కాదు, లోపలికి ప్రవేశించడానికి అనుమతి లభించింది. మరో అరగంట గడుస్తూండగా హైమవతి హాలులోకి వచ్చింది వయ్యారంగా మేడమెట్లు దిగుతూ.

మర్యాదగా నమస్కరించారు లలితా, సరళా.

అంతకు మించిన మర్యాద ఒలికిస్తూ "నమస్కారం, నమస్కారం" అంటూ రెండుసార్లంది హైమవతి.

"కూర్చోండి. ఏం పనిమీద వచ్చారు?" మర్యాదగానే అడిగింది హైమవతి.

సరళ మాట్లాడలేదు.

లలితే సంభాషణ కుపక్రమించింది. "నేను కాలేజీలో చదువుతున్నాను. ఫలానావారి అమ్మాయిని......" అంటూ తనను తాను పరిచయం చేసుకొంది.

"ఓహో! అయితే వీరు మీ లెక్చరరా?" అన్నది సరళను చూపుతూ.

తల్లీకూతుళ్ళిద్దరూ కూడా, హైమావతి ఇంకా తమను గుర్తించనట్టూ, తెలియనట్టూ వేసిన ఈ ప్రశ్నకు ఖేదపడ్డారు. అయినా లలిత సరళంగానే ఇచ్చింది జవాబు: "కాదండి. మా అమ్మగారు ఈవిడ. పేరు సరళ ... ..."

"ఓహో!" తలపంకించి ఊరుకుంది హైమవతి.

"మా కాలేజీ స్టూడెంట్స్ ఎసోసియేషన్ ఒక చేతి పనుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తోంది. అందులో వస్తువులు అమ్మగా వచ్చిన డబ్బును రక్షణనిధికి ఇవ్వాలని నిర్ణయించు కున్నాం. ఆ రోజు దానికి మీరు ప్రారంభోత్సవం చేసి, ఏమైనా మాట్లాడాలని మా కోరిక. మా స్టూడెంట్స్ తరఫున నేను వచ్చాను మిమ్మల్ని ఆహ్వానించి అనుమతి పొందడానికి."

"మంచిది. చాలా మంచి పనిచేస్తున్నారు!" హైమ వతి మనస్సు ఆనంద ప్రఫుల్లమైందని ఆమె ముఖం చెప్పక చెబుతోంది. "ఇలా చిన్నా పెద్దా అందరూ తమతమ శక్త్యానుసారం సాయపడినప్పుడే మన స్వతంత్రం నిలుస్తుంది" అంటూ చిన్న ఉపన్యాసం దంచింది.

"అయితే మేం అన్ని ఏర్పాట్లూ చేసుకుంటాం. మీరు అంగీకరించినట్లే కదూ?" అడిగింది లలిత.

"ఉండమ్మా. నాకు అన్నీ నెలా రెండు నెలల ముందే ఏ ఏ ప్రోగ్రాముకు ఏ టైములో వెళ్ళాలో నిర్ణయించేసి వుంటాయి సాధారణంగా. అంచేత నాకు ఏ రోజు వీలు పడ్తుందో చూసి చెప్తాను. మీరు ఆ రోజుకు ఏర్పాటు చేసు కోండి." అంటూనే హైమవతి తన టేబుల్ డైరీ చూడ టంలో నిమగ్నమైపోయింది.

అంతవఱకూ నోరు విప్పకుండా హైమవతినీ, ఆమె వేషాన్నీ, ఆ కూర్చున్న గదినే పరీక్షిస్తోంది సరళ.

నేలమీాని కార్పెట్ నుంచీ, గోడలమీాది పెయింటింగ్స్ వఱకూ అల్మారాలో షోపీసెస్, బల్లమీాది ఫ్లవర్ వాజులు పేపర్ వెయిట్‌లు సర్వం విదేశీ వస్తువులే! ఎంతో విలువైనవి. హైమవతి కట్టిన పాము కుబుసంవంటి సిల్కు చీర — ఎంత బాగుంది. ఎంత ఖరీదో!

ఎవరో ఇద్దరు సంఘ సేవికలు వచ్చారు.

డైయిరీ ప్రక్కన పెట్టి, వాళ్ళతో మాటలు సాగించింది హైమవతి. సరళా, లలితా తన మాటకోసం వేచివున్నారనే విషయంకూడా మఱచిపోయినట్లుందామె తీరు చూడగా.

వాళ్ళతో మాటలు ఏమిటో ప్రక్కవారికే వినిపించనంతగా గుసగుసలతో సాగిపోయేయి.

"ఆలస్యమైపోతోంది లలితా!" సరళ మెల్లగా అన్నది కూతురితో. "పోనీ వెళ్ళిపోయి మరోసారి రాకూడదూ నువ్వు?"

లలిత ఏమీా చెప్పలేకపోయింది. ఓసారి తల్లి మొహం వేపూ, మరోసారి హైమవతి మొహంవంకా చూచి వూరుకుంది.

"హల్లో మమ్మీా!" అతి నాగరికత ఒలకబోస్తున్నట్లుగా ఉన్న ఆ పిలుపు విన వచ్చిన దెస అందరి కళ్ళూ మళ్ళాయి. ఓ పద్దెనిమిదీ ఇరవయ్యేళ్ళమ్మాయి–పాదంనుంచి తల వఱకూ అత్యాధునిక ఆంగ్లయువతిలాగా ఉన్న వేషంతో,

ఓ పిల్లి పిల్లను చేతుల్లో పట్టుకొని ముద్దులాడుతూ మేడమెట్ల మీదినుంచి గెంతుతూ దిగుతూ వచ్చింది.

"ఎప్పుడొచ్చావు మమ్మీ ? నాకు తెలియనే తెలియదే ! పైన నేనూ సోమూ కార్డ్సు ఆడ్తున్నాం." సంభాషణంతా ఇంగ్లీషులోనే !

"ఓ, ఐసీ ! ఇంట్లోనే ఉన్నావన్నమాట !" హైమవతి అతి గారంగా పసిపిల్లతో మాట్లాడినట్లు మాట్లాడ్తోంది. "సాయంత్రం పాలూ, టిఫినూ ఏమైనా తీసుకున్నావా ? సోము తీసుకున్నాడా ?"

"ఆఁ. అవన్నీ అయ్యాయి." మాటల మధ్యల్లో ఒక్కోసారి పిల్లిని దువ్వుతూ ముద్దుపెట్టుకుంటూ ఎన్నో వగలు పోతోంది. "సోము ఇవ్వాళ నన్ను వాళ్ళింటికి డిన్నర్‌కు రమ్మంటున్నాడు. వాళ్ళ మమ్మీ డాడీ నైనిటాల్ నుంచి వస్తున్నారట ఇవ్వాళ ! వాళ్ళకు పరిచయం చేస్తాడట !" గిరజాల జుట్టును పోగ్గా ఎగరేస్తూ చేతి ఫారెన్ వాచీలో టైము చూసుకుంటూ అన్నది.

"వెళ్ళి తొందరగా వచ్చేసేయి మరి ! రేపటి పిక్నిక్‌కు నే నింకా ఏమీ సర్దనేలేదు !"

"ఓకే ! బైబై ! సీ యూ ఎగెయిన్ !" అంటూ పిల్లిపిల్లతో సహా తిరిగి పోగ్గా వెళ్ళిపోయింది మేడమీదికి.

అప్పటికి హైమవతి తిరిగి అక్కడ ఇతర మానవ జీవు లున్నట్లుగా గమనించింది. "హిహిహి ! మా అమ్మాయి. సెలవులకు వచ్చింది బొంబాయినుండి." అన్నది గ్రామ సేవికలతో.

"మరేను !" ఏం మాట్లాడాలో తెలియనట్లుగా గొణిగిందొకామె.

"పిల్లిపిల్ల అంటే చాలా ముద్దు కాబోలు !" రెండవ ఆమె అన్నది. అది ఎంత ఎబ్బెట్టుగావున్నా సరే-అటువంటి వారు నగ్నంగా తిరిగినా, పేడ చేసినా ఏం చేసినా అవి హాబీలంటూ అఖండంగా ఆకాశాని కెత్తవలసిందే ! తీరిక సమయాలలో విచ్చలవిడిగా తిరగడం ఇష్టం, పిడకలు చేసి లెఖ్ఖ పెటుకుంటూ కూర్చోవటం సరదా - అని మెచ్చవలసిందే !

హైమవతి హుందాగా అన్నది. "ఆఁ ఔను. ఆ పిల్లి పిల్లను సయామ్ నుంచీ ఒకరు తెచ్చి మా బేబీకి ప్రజంటు చేశారు. దానికన్నీ ఎంతెంత మంచి అలవాట్లనుకున్నారూ?" అంటూ శ్రోతలందరి దెసా ఒక్కసారి చూచింది.

లోలోపల ఎలావున్నా పైకిమాత్రం అందరూ ఆమె చెప్తూన్న విషయంపై శ్రద్ధ చూపుతూన్నట్లే ఉన్నారు. అవసరం మరి !

హైమవతి వివరించింది. "దాని పక్కమీదనే అది పడుకుంటుంది దానికి దాని పళ్ళెంలో - గిన్నెలో ఉంచినవే తింటుందికాని ఇంకెక్కడి వస్తువూ ముట్టుకోమంటే ముట్టుకోదనుకోండి. కన్నెత్తి చూడదు. బొద్దుగా - ఎంతందంగా ఉన్నదో చూశారా ? అంత మంచి జాతి పిల్లి గనుకనే అమ్మాయి ముచ్చటపడి పెంచుకుంటోంది. సయాం పిల్లులు పెట్టింద పేరనుకోండి నిజంగా ! వెధవ్వి - మన పిల్లులనే చెప్పాలి. దరిద్రాలు !"

"నిజం." అనక తప్పలేదు, పళ్ళన్నీ బయటపెట్టి.

"ఒక్కటున్న మాటేమిటీ? మా అబ్బాయి-స్టేట్స్‌లో ఉన్నాడు - ఇన్నేళ్ళైంది - ఒక్కసారి రమ్మన్నా ఈ దేశానికి రానుపొమ్మంటాడు. అక్కడేముందని రానూ అంటాడు. మరి అక్కడి పిల్లనే చేసుకుంటాడో, ఇక్కడెవర్నైనా చేసుకుంటాడో తెలియదు! పొరపాటున ఇండియాలో నా కడుపున పుట్టాడుకానీ - వాడి ఠీవీ, దర్పమూ, రూపూ - అంతా దొరల బిడ్డ కాడూ?"

"నిజం నిజం!" తప్పనిసరిగా వినే అభాగ్యు లంతకంటె ఏమనగలరు గనుక?

మేడ దగి వచ్చి, "మమ్మీ వెళ్తున్నా" అంటూ సోమూ చేయిపట్టుకుని వెళ్ళిపోయింది హైమవతి కూతురు. సోము చేసీ చేయనట్లుగా ఓ నమస్కారం పడేసి వెళ్ళాడు హైమవతికి, షైటు ప్యాంటూ వగైరాలు సరిగా వున్నాయో లేదోనని సరిజూచుకుంటూ.

వాళ్ళలా వెళ్ళడమూ జలజ ఇలా లోనికి ప్రవేశించడమూ ఒక్కసారే జరిగాయి.

జలజను చూడగానే సరళకు పరమానందం కలిగింది.

జలజ మాత్రం ఒక్కసారి పొడిపొడిగా పలకరించి, హైమవతితో ఏదో రహస్య సంభాషణలో పడిపోయింది. సరళను ఎరిగివున్నట్లు మాట్లాడడంకాని, హైమవతికి పరిచయం చేయడంగానీ చేయలేదు.

జలజ వెంట మరో ముగ్గురు యువకులు కూడా వున్నారు.

ఎవరో రాజకీయాలు గురించి మాట్లాడ వచ్చిన వారేమో నన్పించింది వారి వేషభాషలను బట్టి.

అందుకే లలితా, సరళా ఇక లేవడం మంచిదని "వెళ్తా"మని లేచి నిలబడ్డారు.

"ఆఁ ఆఁ. రేపొకసారి కన్పించమ్మా. నాకు వీలైన తేదీచూసి చెప్తాను !" అన్నది హైమవతి లలిత నుద్దేశించి.

"ఏమిటి !" జలజ అడగగా హైమవతి వివరించింది.

జలజ అక్కడ ఏమీ మాట్లాడలేదు.

తర్వాత సరళనూ, లలితనూ గేటు వఱకూ పంపుతూ "చూడు లలితా ! నువ్వింకా చిన్నపిల్లవు. ఏమీ తెలియని దానివి గనుక చెబుతున్నాను. ఆరోజు ఎవరిదైనా ఓ కారు ఏర్పాటు చేయాలి హైమవతమ్మగారిని కాలేజీకి తీసుకెళ్ళ డానికీ, తిరిగి ఇంటికి దిగబెట్టడానికీ"

లలిత అమాయకంగా అన్నది: "వారికే రెండు కార్లున్నాయికదా ఆంటీజీ ?"

నవ్వింది జలజ. "వుంటే ? అవి ఇటువంటి పనులన్నిటికీ వాడతారామరి ? కాస్త లోకం అర్థం చేసుకోవాలమ్మా." ఆప్యాయత ఒలికించుతూ లలిత భుజం తట్టింది. "ప్రారంభోత్సవానికి కాస్త ఎవరైనా పేపర్లవాళ్ళనీ, ఓ ఫొటోగ్రాఫర్‌నీ ఏర్పాటు చేయాలి. ఇటువంటివి పత్రికలలో పడడం ఎంతైనా అవసరం కదూ మరీ ? రేపో, ఎల్లుండో వచ్చి కన్పించు" అంటూనే జలజ లోనికి నిష్క్రమించింది.

సరళా, లలితా ఎంతో చిన్నతనమూ, అవమానమూ ఫీలయ్యారు.

దారిలో లలిత అన్నది తల్లితో. "జలజ అసలు రంగు యిదన్నమాట ! వీళ్ళంతా దేశసేవ అంటూ తిరుగుతూ దేశంలో వారినీ దేశాన్నే అసహ్యించు కుంటారన్నమాట !"

సరళ మాట్లాడలేదు.

హైమవతి చేసిన అవమానంవల్ల ఆమె చాలా బాధ పడ్తోందని గ్రహించిన లలిత ఇంకేమీ మాట్లాడలేదు.

ఇల్లుజేరేముందు అన్నది సరళ గంభీరంగా: "చూడు లలితా ! మీ నాన్నగారికి వివరాలేమీ చెప్పనవసరంలేదు. జరిగిందేదో జరిగింది. ఎవరి కామెంట్సూ మాత్రం విని సహించే శక్తి నాకు లేదు. ఇకముందు నువ్వు మాత్రం ఎవ రికీ హైమవతి మీ అమ్మ స్నేహితురాలని చెప్పకు. ఒకనాటి సహాధ్యాయినిని నేను మఱచిపోకపోవచ్చు - అందరూ నాలా గానే వుండాలని లేదుగదా ! మనుష్యుల స్వభావం అనేక రీతులు !"

లలిత బాధగా అన్నది : "నిజమేనమ్మా. నాకు తెలి యక అందరితో చెప్పేను. అనవసరంగా మా గురించి ఈరోజు నువ్వు... ..."

"ఫర్వాలేదులే. మనుషుల అసలు రంగు బయట పడింది."

"ఇంత ఆలస్యమైందేం ? ఆవిడ ఒప్పుకున్నారా ?" అని సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు "ఆమె ఇంటి దగ్గఱ లేరు. వస్తారని చూశాం యింతవఱకూ." అని తల్లీకుమార్తె లిద్దరూకూడా అసత్యమాడవలసి వచ్చింది.

# 5

"వచ్చిన ఎగ్జిబిషన్ ఓపెన్ చేయడానికి హైమవతి గారు ఒప్పుకున్నారా ?" అని అడిగిన మిత్రురాండ్రకు లలిత పూర్తిగా చెప్పకపోయినా చూచాయగా మాత్రం చెప్పక తప్పలేదు.

"దానికేముందీ ? మా కారు నేర్పాటు చేద్దాం." అనేసింది సూపర్నెంటు ఇంజనీరుగారమ్మాయి కమల.

"పోనీ ఇంకెవరైనా - ఎవర్నో ఎందుకూ ? అంతటి ఇంజనీరుగారు కదా - మీ నాన్నగార్నే పిలుస్తే సరిపోలా ? వీళ్ళందర్నీ ప్రాధేయపడటం ఎందుకూ ?" చాటుగా అడిగింది లలిత.

"అది నిజమే. కాని లోకులు ఎందుకో గొర్రెలమంద స్వభావాన్ని ప్రదర్శిస్తారు ఒకళ్ళ పేరు ఏదైనా కారణంగా మ్రోగుతోందంటే వాళ్ళనే ప్రారంభోత్సవాలకి, సభాధ్యక్ష పదవు లలంకరించడానికి – ఒకటేమిటి ఒకచోట ఎవళ్ళైనా ఛస్తే ఏడవటానికీ, మరోచోట ఎవళ్ళకైనా బహుమాన మొస్తే లేక సన్మానం జరిగితే నవ్వటానికీ, పొగడటానికీ — అన్నింటికీ వాళ్ళనే పిలవాలి. వాళ్ళు వచ్చి వీళ్ళు ఆడమన్నట్లల్లా ఆడతారు. చాటున వాళ్ళడిగినవన్నీ వీళ్ళు తీరుస్తారు.

సభకి పిల్చి వాళ్ళకింత పబ్లిసిటీ ఇచ్చినందుకు మరెప్పుడైనా వీరి కోరికను మన్నించి వారు, తమ పలుకుబడినంతా ఉపయోగించి ఏ మినిస్టరుకో రికమెండేషన్ చేయడం వగైరాలు చేస్తారు. ఇవన్నీ మన కర్థంకాని చిదంబర రహస్యాలనుకో."

"కాబోలు మరి!" అయోమయ మన్పించిన లలిత అంతకంటె మాట్లాడలేకపోయింది.

తిరిగి కమలే అన్నది: "మన కాలేజీ వాళ్ళందరూ కూడ హైమవతీ—హైమవతీ అని పడి ఛస్తున్నారు. మనం కాదంటే ఎవరికి లెఖ్ఖ గనుకా? అంచేత ఆ హిరణ్యాక్షవరా లేమిటో తీర్చేసి పిల్చి చేతులు కడుక్కుంటే పోలా?"

"సరే, కానీయ్ మరీ?"

"పద. కారు పంపిస్తాం. ఫోటోలు తీయించి పేపర్లకిస్తాం. చక్కటి పూలదండ - లేకపోతే కర్పూరం దండ — మీరేం కోరితే అది మెళ్ళో వేస్తాం. అక్కడ ఓ కూల్ డ్రింక్ కూడా సమర్పించుకుంటాం' అని చెప్పొద్దాం."

ఫక్కున నవ్వేసింది లలిత. "కూల్ డ్రింక్ కాకుంటే ఆవిడకి హాట్ డ్రింకు ఇస్తావేమిటీ?"

"ఏం, విడ్డూర మనుకుంటున్నావా అది మాత్రం? ఈ నాడు పార్టీలలో ఏమిటీ, ఇళ్ళల్లో ఏమిటీ హాట్ డ్రింక్స్ తాగే ఆడవాళ్ళు ఎంతమంది లేరూ? పెద్ద పెద్ద పార్టీలలో చాలామంది తాగుతున్నారిపుడు."

"ఏమో, నాకు తెలియవవన్నీ. మీ నాన్నగారు పెద్ద ఆఫీసర్ గనుక ఆ పెద్ద పార్టీలవీ నీకు తెలుస్తాయి మరి!"

"పోనిద్దూ, ఏదైనా ఒకటే ! పనిమనిషి అప్పలమ్మా, కూలివాడు రామన్నా వాళ్ళ గుడిసెల్లో నాటుసారాయి త్రాగుతారు; హైక్లాసు ఆఫీసర్ గారూ ఆయన సతీమణీ ఫారెన్ డ్రింక్స్ త్రాగుతారు మేడల్లోనూ, పార్టీల్లోనూ. అంతే తేడా! మడీ, ఆచారం మధ్యతరగతి వాళ్ళకే మిగిలిపోతాయి."

"సర్లే. మన కెందుగ్గానీ గోల - వెళ్ళి తొందరగా పిలిచేసి వద్దాం."

సూపర్నెంటెంట్ ఇంజనీర్ గారి కాన్వాడంవల్ల ఏ అభ్యంతరాలూ, ఆరాలూ లేకుండానే లోపలికి సూటిగా ప్రవేశం కలిగింది.

ఎక్కడా మనుష్యుల అలికిడే లేదు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఎటు వెళ్ళడానికీ పాలుపోక, ఎవరిని పిలవాలో ఎలా పిలవాలో అర్థంకాక అన్ని దిశలకూ చూస్తూ అలా నిలబడిపోయారా పెద్ద హాలులో.

కొద్ది సేపటికి ఆ ప్రక్కనున్న గదుల్లో ఓ గదిలోంచి ఏవో మాటలు వినవస్తూంటే మెల్లగా అటు దారి తీయబోయింది కమల.

"వెళ్ళొచ్చునో లేదో ! ఇక్కడి నుంచే పిలు !" సందేహం వెలిబుచ్చింది లలిత.

"ఇటువంటి వాళ్ళకు కుక్కలుంటాయి. కనీసం అవి భౌ భౌ మంటూంటేనైనా ఎవరో వచ్చారని తెల్సుకుని ఈ అంతఃపురాలలోనుండి ఈవలికి ఎవరైనావచ్చి కాస్త వచ్చిన వారిఅజాపజా కనుక్కుని రక్షిస్తారు!" అంటూనవ్వింది కమల.

"కనీసం మన మాటల అలికిడైనా విన్పించినట్టే లేదే ఎవళ్ళకీ !" ఆశ్చర్యం వెలిబుచ్చుతూ రెండడుగులు ముందుకు వేసి గదిలోకి వంగిచూచిన కమల కొయ్యబారినట్లే నిలబడి పోయింది, విడ్డూరంగా చూస్తూ.

అదేమిటో ఎంతకూ అర్థంకాక తానూ ఆమె ప్రక్కకు వెళ్ళి దృష్టి సారించిన లలిత బిగుసుకు పోయింది భయంతో.

వారినలా మాటా పలుకూ లేకుండా నిలబెట్టిన దృశ్యం గదిలోనున్న కాశ్మీర తివాచీలపై పేర్చబడిన బంగారు కణికలు, రిస్టు వాచీలు, హైమవతీ, ఆమె భర్తా, ఊళ్ళో పేరు మోసిన నలుగురు వడ్డీ వ్యాపారస్థులూ, ఇద్దరెవరో యితర రాష్ట్రాలకు చెందినవారిలా కన్పట్టుతూన్నవారూ ! అందరూ ఆ విషయమైన బేరసారాలలో మునిగి ఉన్నట్లుగా విన వస్తున్నాయి మాటలు. అందరి చేతులలో, హైమవతితో సహా విస్కీ గ్లాసులు !

"ఇది వఱకులాగే అంటే కుదరదు సేఠ్ జీ ! రోజు రోజుకూ పెరిగిపోతూన్న ధరవరలు చూస్తున్నారు కదా ! మీరు మా కమీషన్ పెంచక తప్పదు !" హైమవతి అంటోంది !

"ఈ తడవకు యిట్లా పోనీండి భే... ..." ఒక సేఠ్ బ్రతిమాల్తూన్నట్లుగా అంటున్నాడు.

"కష్టమ్సువాళ్ళు ఆనాటి కానాడు రూల్సు బిగించేస్తున్నారు. ఎంత కష్టంమీద వస్తోందో సరుకు మీరు గ్రహించాలి! ఎక్కడికక్కడ దాటుకురావడానికే అయిపోతోంది!" ఒకమనిషి అంటున్నాడు. "వచ్చే ఆదివారానికి సీసాలుకూడా

వచ్చేస్తాయి ! ఇలా బేరాలాడితే ఎలా మరీ ?" హైమవతి భర్తనాగభూషణం సమర్థింపుగా మాట్లాడుతున్నాడు. "కింగాఫ్ కింగ్స్, వైట్‌హార్స్ ! ఎవరైనా ఎగరేసుకుపోతారు. ఛాన్సు పోగొట్టుకోకండి. వాళ్లెంత రిస్కు తీసుకు తెస్తున్నారూ, నేనెంత రిస్కు తీసుకుంటున్నానూ, ఇదంతా ఆలోచించరేం ?"

మరోగారపళ్లాయన పళ్ళికిలిస్తూ అన్నాడు. "నిజమే కాని ... ... ఇందులో అందరం ఒక్కో విధంగా రిస్కు తీసుకుంటూన్న వాళ్ళమే ! ఇటువంటి పనుల్లో రిస్కు లేని దెవరికి లెండి ! ఇంకెందుకు, మీరన్నట్టూగాదు, మేమన్నట్లూ గాదు. మధ్యస్థంగా సెటిల్ చేసుకుందాం ఈ సారికి !"

"సరే. కానీయండి !"

బ్రీఫ్‌కేసెస్‌లోంచి నోట్ల కట్టలు బయటికి వచ్చి చేతులూ, జేబులూ మారుతున్నాయి. బంగారపు పలకలు, వాచీల పెట్టెలూ, ట్రాన్సిస్టర్ రేడియోలూ తిరిగి పెట్టెల్లోకి వెళ్తున్నాయి !

అంతవఱకూ పరిసరాలు మఱచిపోయిన లలితా, కమలలు ముఖముఖాలు చూచుకున్నారు. కమల సౌంజ్ఞ చేసింది. దానితో ఇద్దరూ వెళ్ళి తిరిగి దూరంగ తమ పూర్వస్థానంలో నిలబడ్డారు.

"వెళ్ళిపోదాం !" లలిత బెదరిపోతూ అన్నది.

"మనకేం భయం. ఫర్వాలేదు." కమల మొండికేసింది. "వచ్చిన పని చేసుకునే వెళ్దాం."

"ఛీ. ఇంకెందుకూ ! అసహ్యంగా లేదూ ?"

అంతలో మేడ మెట్లమీద ఏదో అపరిమితమైన కులుకులతో కూడిన పకపకలూ, వికవికలూ వినరావడంతో అటు తిరిగాయి ఇద్దరి దృక్కులూ

ఆ వూళ్ళోకల్లా పేరు ప్రఖ్యాతులుగల ధనవంతుడూ, కళాపోషకుడూ అయిన వెంకటేశ్వర్రావుతో జట్టాపట్టాలు వేసుకుని కిలకిలలాడుతూ పై అంతస్థునుంచి క్రిందికి వస్తూన్న హైమవతి కూతురు, హాలులో నిలబడ్డ కమలా, లలితలను చూచి ముఖం చిట్లించి అయిష్టంగానే అతడికి దూరంగా జరిగి, "ఎవరు కావాలి?" అనడిగింది అసహనం వ్యక్తపరుస్తూ.

విస్మయావస్థనుంచి తేరుకోని లలిత అలాగే చూస్తూండి పోయింది. ఎదుట జరుగుతూన్న దుర్మార్గాలు చూచి తానేదో దుర్వర్తినిలాగా కుంచించుకు పోయిందామె ముఖమెత్త లేకుండా. కొంచం ఓట్టుతనంగల కమల మాత్రం, "హైమవతి గారికోసం, కాలేజి స్టూడెంట్సు వచ్చారని చెప్పండి !"

ఆమె ఏదో గొణగడంతో వెంకటేశ్వర్రావు తిరిగి పైకి వెళ్ళిపోయాడు.

"మమ్మా సంబడీ ఫర్ యూ ?" అంటూ కూతురు అరవడంతో, "నాకిప్పుడు టైములేదు. కొంచంసేపు కూర్చోబెట్టు" అంటూ హైమవతి సమాధానం వినవచ్చింది లోపల్నుంచి

"ఐ థింక్ యు కాంట్ సీ హర్ టు డె !" అన్నది హైమవతి కూతురు.

అటువంటి వాళ్ళతో అంతకంటె పెడసరంగా ప్రవర్తించగలదు కమల. "ఎజంట్ మాటర్. ఏ థింక్ వుయ్

కాంట్ కమ్ ఎగెయిన్ ! బై బై !" అంటూనే బయటికి దారితీసింది, లలిత అనుసరించింది.

"డోంట్ బాదర్ మమ్మీ ! కారీ ఆన్ విత్ యువర్ వర్క్ ! దె ఆర్ నాట్ ఇంపార్టెంట్ పీపుల్ !" అని వెనుక అనడం స్పష్టంగా ఆ ఇరువురికీ విన్పించింది.

తల్లీ కూతుళ్ళు నిన్న ప్రయత్నపూర్వకంగా సత్యన్నారాయణ వద్ద దాచిన విషయం నేడు కమలవల్ల బహిరంగమైపోయింది.

అయితే, వారనుకున్నంతగా అతడు ఆశ్చర్యం ప్రదర్శించలేదు. అతి నిశ్చలంగా విని, గంభీరంగా చిరునవ్వు నవ్వాడు.

"మీరు ఇంకా లోకం తెలియని పసివాళ్ళు ! అందుకే అంత కలవరపడ్తున్నారు. మేం ఇటువంటి వెన్నో చూచి, విని వున్న వాళ్ళం !"

"కానీ... ...ఇంతటి దేశభక్తురాలనీ.. ..." ఎలా పూర్తి చేయాలో తెలియక అర్ధోక్తిగా వదిలేసింది కమల.

హేళనగా నవ్వాడు సత్యన్నారాయణ. "దేశభక్తులు కాదమ్మా ! నిజమైన దేశభక్తులకు చెడ్డపేరు తెచ్చే చీడపురుగులు ? ఇటువంటి నీచులనుబట్టి దేశభక్తు లందర్నీ, రాజకీయవాదు లందరినీ అమర్యాదగా మాట్లాడడం మంచిది కాదు ! ఎందరో ఉత్తములు తమ ఆస్తులను, జీవితాలనూ దేశంకోసం త్యాగం చేశారు - చేస్తున్నారు ! మరెందరో మనలాటి వాళ్ళు కనీసావసరాలూ, సర్దాలూకూడ మానుకొని భక్తిగా ఇచ్చిన ధనమూ, వస్తువులూ ఇలా తమ తమ

ఖుషీలకూ, త్రాగుళ్ళకూ, అత్యాచారాలకూ అక్రిమ్కాం కర్యం చేసుకుంటూన్న ఘాతకులు మరికొందరు. ఇది ప్రపంచం !"

"అంతేనా ? అంతకంటె ఇంకేం చెప్పలేరా మీరు ?" నిరుత్సాహంగా అడిగింది కమల.

"ఎందుకు ? నేనూ, మరొకళ్ళూ ఎందుకు చెప్పాలి ? ఇలా అనవసర ప్రసంగాలకోసం అనర్థాలను అందలమెక్కిస్తూంటేనే అసలు దేశానికి ఇన్ని అనర్థాలొస్తున్నాయి. గురువిందగింజ సామెతను ఋజువు చేయకుండా ఎవరికివారు యింగితమెరిగి ప్రవర్తించినదానికి మిన్న ఏదీ లేదు."

"గురువింద గింజా ?" కమలా, లలితా ఒకేసారి అడిగారు.

"ఔను. 'ఎవర్నో తీసుకురావాలీ, ఏదో చేయాలీ' అని తాపత్రయపడ్డంలో మీ ఆంతర్యం ఏమిటీ ? ఇంతటి వాళ్ళని తీసుకొచ్చాం, ఇన్ని పనులు చేశాం – అని పదుగురికీ చాటుకోవాలనే కదా ?"

కమలా, లలితా మాట్లాడలేకపోయారు.

అతడే మళ్ళీ అన్నాడు: "ఇంతంత చిన్న పనులకే మనం యింత గొప్పగా ఘనంగా భావించుకొంటే ఎంతెంతో గొప్పవారూ మహాత్ములూ ఏమనుకోవాలిక ? వేలాదిమందికి తెలిసేట్టు హంగామా చేయాలి - లక్షలాదిమందికి తెలిసేట్లుగా చెక్కులందిస్తూన్న ఫోటోలు పేపర్లలో వేయించుకోవాలనేది నిజమైన సేవ కానేకాదు.

"అలా వీధుల్లో చూడు-ఏమీ లేక అల్లల్లాడేవాళ్లెంత మంది ? చెయ్యిచాపి అడుక్కొనే ప్రతివాడూ బిచ్చగాడు కాదు. నిజంగా లేమితో కృశించిపోతూన్న కుటుంబా లెన్ని లేవు ? నిలువ నీడ లేక, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణకుతూ చెట్టూ చేమల మాదిరిగానే తామూ బ్రతుకులు వెళ్ళదీస్తూన్న జీవు లెందరు కన్పించరు ఫుట్ పాత్ ల మీాద? నిజంగా దాతృత్వ బుద్ధే ఉంటే ఎక్కడున్న ధనికులు అక్కడి బీదలకూ, అనాథులకూ సాయంచేస్తే చాలు — దారిద్ర్యం నామరూపాలు లేకుండా మాయమౌతుంది. సౌభాగ్యం వెల్లివిరుస్తుంది.

"నీ యింట పనిమనిషి బాధలలోవున్నా రెండురూపాయలు ఎక్కువ ఇవ్వటానికి బాధపడ్తావ్. సెలవు మంజూరు చేయటానికి అభ్యంతరం చెప్తావ్. నీయింటి ఎదుటి గుడిసెలో వాళ్ళు ఆకలికి అల్లాడుతుంటే లెఖ్ఖ జేయవు. వీధిన ఏమైనా అమ్మవచ్చిన పేదరాలి దగఱ గీసిగీసి బేరం చేస్తావ్. ఎక్కడో ఎవరికో సాయం చేయటానికి మాత్రం ఆర్భాటంగా రూపాయలు వెదజల్లుతావ్ ... దేశభక్తి తల్లి భారతీ అంటూ చిలుక పలుకులు చెప్పేవాళ్ళ ఇళ్ళకెళ్ళి చూడు - ఎన్నెన్ని దొంగ రవాణాలలో వచ్చిన విదేశీ సరుకులు కన్పిస్తాయో ! ఇటువంటి గురువిందగింజలు దేశాభ్యున్నతికి చెదపురుగులన్న మాట !"

"నిజమే బాబయ్యగారూ !" కమల అంగీకరించింది. "అనవసర ఆడంబరాలకూ, ప్రగల్భాలకూ పోకుండా యెవరి

మట్టుకు వారు నీతిగా బ్రతికినంత ఔన్నత్యం ఇంకెక్కడా లేదు !"

కాలక్రమాన ...... కొన్ని నెలల అనంతరం ... జలజ భర్త ఆస్తినంతా జలజ పేరన వ్రాసేసి అప్పులవాళ్ళ నెత్తిన సర్లజ్జగా చేతులు పెట్టి అయిపీ పెట్టాడని విన్నప్పుడు సత్యన్నారాయణ ఆశ్చర్యపోలేదు. బ్రతికుండీ చచ్చినవాడితో జమ అయిన ఆ బ్రతుకు ఎందుకూ ?

ప్రభుత్వంవారి రహస్య నేర పరిశోధక శాఖోద్యోగుల పుణ్యమా అని - విదేశీ వస్తువులు స్మగులింగ్ చేస్తూన్న వారికి సాయపడ్తూన్నందుకుగాను హైమవతీ, భర్త నాగ భూషణం అరెస్టయ్యారని విన్నప్పుడు-దేశభక్తి రాజకీయాలూ వగైరా ముసుగులతో వారు మాటిమాటికీ ఢిల్లీలూ, హైదాబాద్‌లూ తిరుగుతూన్న రహస్యం అదని తెలిసినపుడు లలితా, కమలా విస్మయ మందకపోయినా లోకులు విభ్రాంతి చెందారు. 'ఎందుకా హీనపు బ్రతుకులు ?' అనుకున్నారు.

అంత ముద్దు ముద్దుగా మాట్లాడుతూ, చిన్నపిల్లలా ప్రవర్తించటానికి తాపత్రయపడే హైమవతి కూతురు—పెంపుడు పిల్లి సహితం విదేశపుదే కావలసిన ఆ యువతి హైమవతి చెప్పినట్లుగా బొంబాయిలో చదువుకోవటంలేదనీ, విదేశీ వస్తువుల దొంగ రవాణాకు కూడలి అయిన ఓ హోటలులో డాన్సరుగా ఉంటోందనీ, తలిదండ్రులు అరెస్టు వార్త వినడంతోనే ఎవరో విదేశీయుడితో ఎక్కడికో పారిపోయి ఆచూకీ

తెలియకుండా వున్నదనీ తెలిసినప్పుడు మాత్రం కమల కొంత సేపు కనులు కదల్చడం మరచిపోయింది; లలిత మూగవోయి నట్లుగా ఉండిపోయింది.

దారిన వస్తూ, వాన కారణంగా తప్పని సరిగా దగ్గఱ లోనే వున్న జలజ యింటికి వెళ్ళిన సరళ, ఎక్కడో వున్న అనాథులకోసమూ, నిరాశ్రయులకోసమూ అంటూ తన దగ్గఱ నుంచి తీసుకెళ్ళిన పట్టుచీరతోబాటు మరికొన్ని బట్టలతో— స్టెయిన్ లెస్ స్టీలు గిన్నెలు కొంటూండటం చూచి మాత్రం విపరీతంగా విస్తుపోయింది—ఆ సేవకులూ, ఈ ఉద్ధరణలూ అంటూ పెటపెటా ప్రేలడం, బ్రతుకుతెరువుకోసం సిగ్గుమాలిన కక్కుర్తి పనులు చేయటమూ ఎరుగని సరళ !